


*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**లేట్ లంచ్** చేసి మా హోటల్‌కి వస్తూంటే, బయట ప్లాస్టింగ్ చేయని ఎర్ర ఇటుకలతో కొత్తగా కట్టిన ఇళ్ళు గల కైరో ఎర్ర అడవిలా కనిపించింది. రంగులు వేసిన ఇళ్ళ రంగు పొల్యూషన్‌తో నల్లగా మారింది. ఆ ఫ్లై ఓవర్‌కి అటు, ఇటు కింద మన సుల్తాన్ బజార్‌లాంటి మార్కెట్ కనిపించింది. నైల్ నది మీద రెస్టరెంట్ పడవలు కనిపించాయి. వాటిలోకి వెళ్ళడానికి ఒడ్డు మీదకి చెక్కబల్లలు వేసున్నాయి. సుమారు ఆరున్నరకి మా హోటల్‌కి చేరుకున్నాం. లంచ్ ఆలస్యంగా చేయడంతో ఆకలి లేక, ఇండియన్ రెస్టరెంట్‌కి రాత్రి భోజనానికి వెళ్ళలేదు. ఆ రాత్రితో మా కైరో ట్రిప్ పూర్తయింది.

అహ్మద్ లాబీలోని అందర్నీ ఆగమని, మర్నాడు అస్వాన్‌కి వెళ్ళడానికి మమ్మల్ని రెండు గ్రూప్స్‌గా విభజించామని, మాకు రెండు వేరు వేరు ఫ్లైట్స్‌లో సీట్స్ బుక్ అయ్యాయని చెప్పి, అందరికీ బుకింగ్ కన్ఫర్మేషన్ కాగితాలని ఇచ్చాడు. అవి చూసిన నాకు పెద్ద షాక్! ఏ ట్రావెల్ కంపెనీ చేయకూడని పొరపాటు జరిగింది.

భార్యాభర్తలమైన మమ్మల్ని చెరో గ్రూప్‌లో చేర్చారు. పద్మజది మొదటి ఫ్లైట్. అది తెల్లారుఝాామున ఐదుకి. నాది తర్వాతి ఫ్లైట్. ఉదయం పదకొండుం ముప్పావుకి. ప్రతీ కుటుంబం ఒకే గ్రూప్‌లో ఉన్నారు. విడదీసింది కేవలం మమ్మల్నే.

"మా ఇద్దరికీ ఒకే ఫ్లైట్‌లో ఎందుకు బుక్ చేయలేదు?" వెంటనే అహ్మద్‌ని అడిగాను.

"నాకు అది సంబంధం లేదు. స్థానిక ట్రావెల్ కాంట్రాక్టర్ బుకింగ్ చేసాడు" నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

అతను కనీసం మాకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ కూడా చెప్పకుండా వెళ్ళిపోతే మేమిద్దరం నివ్వెరపోయాం. అలా ఆ క్షణంలో వారికి మానసికంగా గుడ్ బై చెప్పేసి, ఇక ఎస్.ఓ.టి.సి ద్వారా ఎక్కడికీ వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో తరచు వారి నించి కొత్త టూర్స్ వివరాలు చెప్పడానికి వద్దన్నా ఫోన్ కాల్స్ రాసాగాయి. వారి నంబర్లని బ్లాక్ చేసేసాను. వారి ఇ మెయిల్ ఎడ్రస్‌ని స్పామ్‌లో పెట్టాను. మా గ్రూప్‌లో వాట్సప్ ద్వారా టచ్‌లో ఉన్న ఒకరు, వారు వెళ్ళిన తర్వాతి టూర్లో జరిగిన ఇలాంటి అవకతవకల గురించి చెప్పి, తాము కూడా ఎస్.ఓ.టి.సికి గుడ్ బై చెప్పేసామని రాసారు. 2013లో మలేషియన్ టూరిజం, 2012లో కానీ ఎస్.ఓ.టి.సి సౌత్ ఏసియాలో బెస్ట్ ఫారిన్ టూర్

ఆపరేటర్ అవార్డులని గెలుచుకున్నాయి. నా ఇదివరకటి ట్రావెలాగ్స్‌లో ఎస్.ఓ.టి.సి టూర్ మేనేజర్లని మెచ్చుకుంటూ రాసాను. కానీ యాజమాన్యం మారాక పరిస్థితి ఇది.

*23.10.2015 శుక్రవారం*

తెల్లవారుఝాము మూడుకల్లా పద్మజ తయారైంది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తూంటే బస్‌లో స్థానిక గైడ్ మహ్మద్ అందరికీ బ్రేక్‌ఫాస్ట్ పాకెట్లని ఇచ్చి, ఎయిర్ పోర్ట్‌లో బోర్డింగ్ పాస్‌లు తీసుకోడానికి సహాయం చేసాడు. పద్మజ బస్ బయలుదేరాక నేను గదికి వెళ్ళిపోయాను.

ఉదయం తొమ్మిదికి హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తిన్నాక గది ఖాళీ చేసేసాను. తొమ్మిదిన్నరకి చిన్న వేన్‌లో వచ్చిన మహ్మద్‌తో మిగిలినవాళ్ళం బయలుదేరాం. బోర్డింగ్ కార్డ్ తీసుకున్నాను. నా సీట్ నంబర్ 27 ఇ. గేట్ నంబర్ ఎఫ్. ఫ్లైట్ నంబర్ ఎం.ఎస్ 395. సెక్యూరిటీ చెక్‌కి చాలా సమయం పట్టింది. ఒకరిద్దరు 'మీ ఆవిడకి కొద్దిసేపైనా దూరంగా ఉన్నారు కంగ్రాట్స్' అని జోక్ చేసారు. 20-30 అనే బోర్డు చూపించే గేట్ల వైపు నడిచాం. పదకొండుం పావుకి బోర్డింగ్ కాల్ ఇచ్చారు. ఎస్కలేటర్లో కిందకి దిగి, బస్ ఎక్కి ఐదు నిమిషాల దూరంలోని విమానం దగ్గరకి చేరుకున్నాం.

అటు రెండు, ఇటు రెండు సీట్లు గల చిన్న విమానం. విమానం గాల్లోకి లేచాక చూస్తే కింద రోడ్లు, ఇళ్ళు తప్ప మిగతా అంతా ఇసక, అంటే ఎడారే కనిపించింది. నేను ఆరెంజ్ జ్యూస్ తీసుకున్నాను. జ్యూస్ గ్లాస్‌తోపాటు పేపర్ నేప్‌కిన్ ఇవ్వని ఎయిర్ లైన్స్ ఈజిప్షియన్ ఎయిర్‌లైన్సే. కోక్, స్ప్రైట్, ఏపిల్ జ్యూస్‌లు కూడా ఉన్నాయి.

నా ట్రావెలాగ్స్ పాఠకుల్లో చాలామంది అడిగే ప్రశ్న, 'చిన్న విషయాలని కూడా ఎలా గుర్తుంచుకుని రాస్తారు? మీరు ఇవన్నీ రాసుకుంటూంటే చూడటం కుదరదుగా' అని. ఉదాహరణకి పై పేరాల్లోని సమాచారం బోర్డింగ్ పాస్‌లోంచి చూసి రాసాను. అంటే ఇది రాసేదాకా దాన్ని నా దగ్గర దాచి ఉంచానన్నమాట. విమానంలో సర్వ్ చేసిన బివరేజెస్ వివరాలు బోర్డింగ్ పాస్ వెనక రాసుకున్నాను. ప్రయాణంలో అందుకు చాలా తీరిక ఉంటుంది కదా. రాసుకునే సమయం లేనప్పుడు సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసుకుంటాను. గుర్తుంచుకోదగ్గ బోర్డులు, విశేషాలని, భోజనాన్ని ఫోటోలు తీసుకుంటాను. లేదా షార్ట్ వీడియోలు. గైడ్ చెప్పేప్పుడు దాన్ని తప్పనిసరిగా దగ్గరగా ఉండి రికార్డ్ చేసుకుంటూ అతను చెప్పేది చూస్తుంటాను. గదికి వచ్చాక రాత్రి పడుకునే ముందు నోట్‌బుక్‌లో ఏ రోజుది ఆ రోజు చూసి, విని రాసుకుని పడుకుంటాను. 'వేర్ దేరీజ్ ఏ విల్, దేరీజ్ ఆల్వేస్ ఏ వే' అని కదా నానుడి. ట్రావెలాగ్స్ రాయాలనుకునేవాళ్ళు ఇలాంటివి పాటిస్తే చక్కటి ట్రావెలాగ్స్‌ని రాయగలుగుతారు. లేదా 'బయలుదేరాం, చేరుకున్నాం, భోజనం చేసాం, చూసాం, పడుకున్నాం' అని పొడిపొడిగా తప్ప ఎవరూ అన్ని వివరాలు గుర్తుంచుకుని రాయలేరు.




ఒకటింపావుకి మా విమానం అస్వాన్‌లోని దారా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో దిగింది. షటిల్ బస్‌లో అరైవల్స్ టెర్మినల్‌కి చేరుకున్నాం. అది చాలా చిన్న ఎయిర్‌పోర్ట్. ఒకే కేరసోల్ ఉంది. పోర్టర్స్ కూడా ఉన్నారు. మా బేగేజ్ తీసుకుని బయట మాకోసం వేచి ఉన్న బస్సెక్కి హోటల్‌కి చేరుకున్నాం.

హోటల్లో ముందు వెళ్ళిన బేచ్ వాళ్ళు లాంజ్‌లో మాకోసం వేచి చూస్తున్నారు. గదులు ఎవరికీ ఇవ్వలేదు. లాంజ్‌లోనే ఉంచి, కావలంటే హోటల్లోని పబ్లిక్ బాత్‌రూంలని వాడుకోమని చెప్పారని, ఇది టెంపరరీ స్టే అని పద్మజ నాతో చెప్పింది.

పద్మజ ఇంకా ఇలా చెప్పింది.

"ఉదయం తొమ్మిదికి ఒకతను వచ్చి 'దాదాపుగా అంతరించిపోయిన నుబియన్ సంస్కృతికి చెందిన చిన్న గ్రామం నైలు నదిలోని చిన్న ద్వీపంలో ఉంది. అస్వాన్ డేమ్ వల్ల వాళ్ళ మిగిలిన గ్రామాలన్నీ నీళ్ళల్లో మునిగిపోయాయి. మీకు ఆసక్తి ఉంటే పడవలో అక్కడికి తీసుకెళ్తాను, మనిషికి ముప్పై డాలర్లు' అని చెప్పాడు. చందన బేరం ఆడి పాతిక డాలర్లకి కుదిర్చింది. కొందరు రాలేదు. చిన్న మరపడవలో పదిమందిమి వెళ్ళాం. నేను నైలు నది నీళ్ళని ముట్టుకుంటానంటే దాని వేగం తగ్గించారు. నేను ఆ నీళ్ళని ముట్టుకుని తలమీద చల్లుకున్నాను. సారవంతమైన నేల, నీళ్ళ ద్వారా, తిండి పెడుతున్నాయని, గంగమ్మ తల్లి, గోదావరమ్మ తల్లి అని నదులని గౌరవించే సంస్కృతి మనలో ఉంది కదా? పైగా తారిఖ్ నైలు నది పదకొండు దేశాలకి తిండిని పెడుతోందని చెప్పారు. అందుకని ఆ నదికి దణ్ణం పెట్టాను. నైలు నది లేకపోతే ఈజిప్ట్‌లో ఏం పండేది కాదు. నన్ను చూసి మిగిలిన వాళ్ళు కూడా అదే పని చేసారు. అందుకని ఆ నదికి దణ్ణం పెట్టాను. నైలు నది లేకపోతే ఈజిప్ట్‌లో ఏం పండేదికాదు. నన్ను చూసి మిగిలిన వాళ్ళు కూడా అదే పని చేసారు. ఓ వైపు నైలు నది నీళ్ళు, మరో వైపు ఎడారి. నేను ప్రకృతిలోని ఆ కాంట్రాస్ట్‌ని ఫోటో తీసి నా ఫేస్‌బుక్‌లో పెట్టాను.

"నిజానికి అది నుబియన్ గ్రామం కూడా కాదు. పదిహేను వందల గజాలకి మించని చిన్న ద్వీపం. అందులో పూరిళ్ళు ఉన్నాయి. వాళ్ళంతా నల్లటి ఆఫ్రికన్స్. గ్రామంలోని ప్రతీ ఇంట్లో చిన్న నీళ్ళ గుంటలున్నాయి. వాటిలో మొసలి పిల్లల్ని పెంచి, పెద్దయ్యాక నైలు నదిలోకి వదులుతారుట. మమ్మల్నా గైడ్ ఓ ఇంట్లోకి తీసుకెళ్ళాడు. అక్కడ హస్తకళల వస్తువులు అమ్మకానికి ఉన్నాయి. మట్టితో చేసిన మాస్కులు, సన్నాయిల్లాంటి ఊదేవి, ఢమురుకాలు, గవ్వలతో, పూసలతో




చేసిన దండలు మొదలైనవి ఉన్నాయి. వాటిలో కొన్ని మరెక్కడో ఎవరో తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. అక్కడి చాలామంది ఇతర జాతుల సంపర్కంతో పుట్టిన వాళ్ళు. వాళ్ళంతా నలుపు, గోధుమ రంగుల్లో, మనదేశంలోని కొండజాతి వాళ్ళలా కనిపించారు. కేవలం ఎయిటీ ప్లస్‌లో ఉన్న ఒక్కాయనే మిగిలి ఉన్న ఆఖరి, వర్ణ సంకరంలేని నుబియన్ సంస్కృతికి చెందినవాడు. నేను ఆయనతో ఫోటో తీయించుకున్నాను. అక్కడో గంటన్నర గడిపాక వెనక్కి తిరిగి వచ్చాం.''

### *నుబియన్ నాగరికత*

ప్రాచీన ఆఫ్రికాలోని నాగరికతల్లో కుష్ సామ్రాజ్యానికి చెందిన నుబియన్ నాగరికత ఒకటి. ఎనిమిదో శతాబ్దంలో ఈజిప్ట్ దీన్ని గెలుచుకుంది. వెయ్యేళ్ళ తర్వాత ఆ సామ్రాజ్యం ఇథోపియాకి చెందిన అక్సుం రాజుల పాలనలోకి, 16వ శతాబ్దంలో ఒటోమన్ పాలనలోకి వచ్చింది. టర్కీకి చెందిన ఒటోమన్స్ నుబియన్ ప్రజల్ని బలవంతంగా ముస్లింలుగా మార్చారు. క్రీ.పూ 6,000 శతాబ్దంలో కుండల తయారీని నుబియన్సే కనిపెట్టారని, గొర్రెలు, ఆవులు మేకల్ని మచ్చిక చేసుకున్నారని ఆనాటి బొమ్మలని బట్టి తెలుస్తోంది. తవ్వకాల్లో రాళ్ళ మీద చెక్కిన అనేక శిల్పాలు, ఖగోళ శాస్త్రానికి చెందిన పరికరాలు కూడా పురావస్తు పరిశోధకులకి లభించాయి. క్రీ.పూ మూడో శతాబ్దం, క్రీస్తు శకం మూడో శతాబ్దం, క్రీస్తు శకం మూడో శతాబ్దం మధ్య నుబియన్స్ గ్రానైట్ రాతితో ఐదు చోట్ల ముప్పై ఐదు పిరమిడ్స్ కూడా నిర్మించారు. కుష్ రాజధాని పేరు కెర్మా.

నైల్ నది సెంట్రల్ ఆఫ్రికాలోని గ్రేట్ లేక్స్ ప్రాంతంలో పుట్టింది. దాని జన్మస్థానం ఇంకా నిర్ధారించబడలేదు. కానీ అది రువాండాలో కానీ, బురుండిలో కాని పుట్టి ఉండచ్చు అని అంచనా. 1951లో అమెరికన్ జాన్ గోడార్డ్, మరో ఇద్దరు ఫ్రెంచ్ పరిశోధకులతో కలిసి నైల్ నది మీద మొదటిసారిగా పూర్తిగా ప్రయాణించాడు. ఈస్ట్ ఇండియా కంపెనీలో తన పదిహేడవ ఏట సైనికుడిగా పనిచేసిన జాన్ హన్నింగ్ స్పీక్ 1854లో పరిశోధన ఆరంభించి, నైలునది జన్మస్థానాన్ని 3 ఆగస్ట్ 1858లో కనుగొన్నాడు. దీని నీటిని పదకొండు దేశాలు వ్యవసాయానికి వాడుతున్నాయి. అవి ఈజిప్ట్, సూడాన్, సౌత్ సూడాన్, ఇథోపియా, యుగాండా, కెన్యా, టాంజానియా, రువాండా, బురుండి.


నుబియన్స్ నిర్మించిన, పిరమిడ్లు

నేను మధ్యాహ్నం ఫ్లయిట్‌లో రావడంతో ఆ ట్రిప్ మిస్సయ్యాను.

మళ్ళీ మా లగేజ్‌తో బస్ ఎక్కి, ఆ హోటల్‌కి కిలో మీటర్ దూరంలో ఉన్న అస్వాన్ డేమ్‌కి బయలుదేరాం. అహ్మద్ బస్‌లో ఫారాలని ఇచ్చి, ఫిలప్ చేయమని కోరాడు. అవి అధికారులకి ఇవ్వాలి. మా ఐటెనరరీ ప్రకారం అస్వాన్ డేమ్‌ని చూసి, నైలు నదిలో ఓడ ఎక్కాలి. రాత్రికి అందులోనే బస.


బస్ బయలుదేరాక అహ్మద్ అందరికీ లంచ్ బాక్స్‌లని, నీళ్ళ సీసాలని ఇచ్చాడు. దారిలో లంచ్ తిన్నాం. అన్నం, బంగాళా దుంపలు, పచ్చి బఠాణీలు కలిపి చేసిన కూర, శాండ్‌విచ్.

***అన్ డిటాచ్డ్ ఒబ్లిస్క్***

హోటల్ నించి అస్వాన్ డేమ్‌కి బయలుదేరిన మా బస్, షుమారు మూడు గంటలకి సగంలో నిర్మాణం ఆగిపోయిన ఓ ఒబ్లిస్క్ దగ్గర ఆగింది. అక్కడ గోధుమ రంగులో పెద్ద స్టోన్ క్వారీ ఉంది. ఇది ఓపెన్ ఎయిర్ మ్యూజియం. పైకి మెట్లున్నాయి. అక్కడ నేలమీదున్న ఓ పెద్ద రాతి మీద సగం చెక్కి వదిలేసిన స్థంభాన్ని చూసాం. దీన్ని 3,500 ఏళ్ళ క్రితం పద్దెనిమిదవ డైనాస్టీకి చెందిన ఫారో రాణి హేట్ షెప్సెట్ నిర్మించింది. అందుకు నిపుణులైన పనివాళ్ళని నియమించింది. కానీ సగం చెక్కాక గ్రనైట్ రాతిలో పగుళ్ళు రావడంతో దాన్ని చెక్కడం ఆపేసారు. ఇది పూర్తై ఉంటే దీని పొడవు 148 అడుగులై ఉండేది. అప్పుడు ఇది ప్రపంచంలోని అతి ఎత్తైన ఒబ్లిస్కై ఉండేది. దీని బరువు కూడా 200 ఆఫ్రికన్ ఏనుగుల బరువుతో సమానమయ్యేది - 1100 టన్నులు. దాని దగ్గరకి వెళ్ళకుండా గొలుసులు అడ్డుగా కట్టారు.


అన్ డిటాచ్డ్ ఒబ్లిస్క్

ఆనాటి పనివాళ్ళు దీన్ని చెక్కేందుకు పెట్టుకున్న గుర్తులు, గీతలు కూడా ఈ స్థంబం మీద కనిపించాయి. రాతికన్నా గట్టిదైన డోలరైట్‌తో చేసిన బంతులతో కొడుతూంటే గ్రనేట్ రాయి పగుళ్ళు రాకుండా విచ్ఛిన్నమౌతుంది. ఇనప గొలుసుతో కట్టిన అలాంటి బంతి కూడా కనిపించింది. కొండ మీది మెట్లెక్కి వెళ్తే, ఓ వైపు మాత్రమే కిటికీగల రాతితో చెక్కిన చిన్నగది కనిపించింది. ఓ చోట రాతిలో పక్కపక్కనే సన్నటి దీర్ఘచతురస్రపు రంధ్రాలని చెక్కారు. పెర్‌ఫొరేటెడ్ కాగితంలోని రంధ్రాల్లా. ఆ రంధ్రాల్లోకి ఎండిన చెక్కముక్కలని కొట్టి, వాటిని నీళ్ళతో తడుపుతూంటే చెక్క ఉబ్బి రాయి పగులుతుంది.


ఈజిప్ట్ ఫ్రండ్ షిప్ మాన్యుమెంట్

మేం తప్ప పర్యాటకులు లేరు.

అక్కడ నించి ఐదు నిమిషాల్లో మూడున్నరకి అస్వాన్

డేమ్‌కి చేరుకున్నాం. డేమ్‌కి ప్రవేశ రుసుము మనిషికి ఇరవై ఐదు అమెరికన్ డాలర్లు. డేమ్ మొదట్లోనే కుడివైపు రష్యన్, ఈజిప్ట్ ఫ్రండ్ షిప్ మాన్యుమెంట్ కనిపించింది. ఆ డేమ్ మీద నిర్మించిన రోడ్ మీద మా బస్ అవతలికి ప్రయాణించి పార్కింగ్ లాట్ లో ఆగింది. డేమ్ మీద, వెళ్ళే దారిలో తుపాకులు ధరించిన గార్డ్స్ చాలామంది దాదాపు పదడుగులకి ఒకరు కాపలాగా ఉన్నారు. ఉగ్రవాదులు కూల్చచ్చనే భయం వల్లనుకుంటాను.

"అరగంట టైం ఇస్తున్నాను. చూసి, ఫొటోలు తీసుకుని రండి" అహ్మద్ చెప్పాడు.

అంతా దిగాం. డేమ్‌కి ఓ వైపు నది, మరో వైపు పూల తోటలు, ఫౌంటెన్స్ మొదలైనవి కనిపించాయి. అదో మానవ నిర్మిత అద్భుతం.

***అస్వాన్ డేమ్***

అస్వాన్ డేమ్‌ని అస్వాన్ హై డేమ్ అని కూడా పిలుస్తారు. కారణం బ్రిటీష్ వాళ్ళు 1898లో నైలు నది మీద మొదటి డేమ్‌ని ఆరంభించి, 1902 డిసెంబర్ కల్లా పూర్తి చేసారు. దీన్ని అస్వాన్ డేమ్ అంటారు. హై డేమ్ ఎత్తు 364 అడుగులు, పొడవు 1,257 అడుగులు, వెడల్పు 3,220 అడుగులు.

1952లో ఈజిప్ట్‌లో తిరుగుబాటు వచ్చింది. అబ్దుల్ గమాల్ నాసర్ బ్రిటీష్ ప్రభుత్వాన్ని సాగనింపి ఈజిప్ట్ అధ్యక్షుడయ్యాడు. దాంతో ఈజిప్ట్, సూడాన్‌లలో 1882 నించి ఉన్న బ్రిటీష్ పాలన అంతమై, ఆ రెండూ స్వతంత్ర దేశాలయ్యాయి. నైలు నదికి వరదలు వచ్చి పంటపొలాలు నాశనం అవడంలేదా నీరు లేక క్షామం రావడం తరచూ జరిగేది. ఆరేళ్ళపాటు నైలు నదిలో నీరే లేకపోవడంతో పంటలు పండక, ప్రజలు నరమాంస భక్షణ చేసారు. అందువల్ల ఈ డేమ్ నిర్మాణం అవసరం ఏర్పడింది.

ఈ డేమ్ నిర్మాణం వల్ల ఆ విపత్తు తొలిగి, హైడ్రో ఎలక్ట్రిక్ ఉత్పత్తి ద్వారా పారిశ్రామికీకరణ జరిగి, ఎకానమీ అభివృద్ధి చెందుతుందని దీని నిర్మాణం చేపట్టారు. నాసర్ అప్పటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్‌తోను, రష్యా లీడర్ కృశ్చేవ్ తోను మాట్లాడాక రష్యా వైపే మొగ్గడంతో అస్వాన్ డేమ్ నిర్మాణంలో రష్యన్స్ సహాయం అందింది. ఈ డేమ్ నిర్మాణానికి రెండు వేలమంది రష్యన్ ఇంజినీర్లు సహకరించారు. (మనదేశంలోని భాక్రానంగల్ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా రష్యన్ సహకారంతో జరిగింది) 1960-1970లలో రోజుకి పాతికవేలమంది పనివాళ్ళు పదేళ్ళపాటు ఈ డేమ్ కోసం పని చేసి పూర్తిచేసారు. ఆ నిర్మాణంకాలంలో అక్కడ వర్కర్స్‌తో చిన్న గ్రామం ఏర్పడింది. సగటున ఏటా డెబ్బై వేలమంది దీన్ని సందర్శిస్తారు. ఇక్కడే ఈజిప్ట్ సరిహద్దు అంతమై నుబియా దేశం ఆరంభమవుతుంది.

దీనికి నూట ఏనభై గేట్లున్నాయి. ఈ డేమ్ వల్ల 1972 ఐసిస్ ఆలయాలు గల ద్వీపం మునిగిపోయి, అక్కడ ఓ పెద్ద సరస్సు ఏర్పడింది. దానికి ఆనాటి అధ్యక్షుడు నాసర్ పేరు మీద నాసర్ లేక్ అనే పేరు పెట్టారు. ఇది ప్రపంచంలోని అతి పెద్ద మానవ నిర్మిత సరస్సుల్లో ఒకటి. మొదట ఉత్తర దిశలోని సూడాన్ ఈ సరస్సు నిర్మాణాన్ని వ్యతిరేకించింది. కారణం తమ

భూభాగంలో నుబియన్ ప్రజలు నివశించే ప్రాంతం మునిగిపోతుంది. వారికి పునరావాసం కల్పించాలి. చివరికి లేక్ నాసర్ వల్ల సూడాన్‌లోని ఐదవ శతాబ్దపు నోబా సామ్రాజ్యానికి చెందిన నుబియన్ గ్రామాలు మునిగిపోయాయి. ఈ సరస్సులోని 83శాతం నీరు ఈజిప్ట్‌లోనే ఉంది. 17 శాతం సూడాన్‌లో ఉంది. సూడాన్ వారు తమ భాగంలోని సరస్సుని 'లేక్ నుబియా' అని పిలుస్తారు. లేక్ నాసర్ విస్తీర్ణం 132 కిలోమీటర్లు. పొడవు 550 కిలోమీటర్లు, వెడల్పు 35 కిలీమీటర్లు. లోతు 430 అడుగులు.

ఇక్కడి చేపల పరిశ్రమలో ఏడువేలమంది పనిచేస్తున్నారు. మిడిల్ ఈస్ట్‌లోనే పెద్దవైన కెమికల్, ఫర్టిలైజర్ ఫేక్టరీలు ఇక్కడే నిర్మించబడ్డాయి. డేమ్ మీద నించి దూరంగా మరోవైపు కింద డబుల్ రోడ్ కనిపించింది.

సాయంత్రం 4.10కి డేమ్ నించి బయలుదేరి సరాసరి నైలు నది ఒడ్డున గల పడవల రేవుకి చేరుకున్నా. దూరం నించే చిన్న ఓడలు ఐదారు కనిపించాయి. మా సామానుతో ఓ ఓడ ఎక్కి, దాని వెనక ఉన్న మరో ఓడలోకి బల్లకట్టులాంటి దానిమీద నడిచి చేరుకున్నాం. దాని పేరు రాయల్ రూబీ. ఇది బయట రేవులోకి కనిపించలేదు. అక్కడి లాంజ్‌లోని గడియారల్లో సమయం న్యూయార్క్‌లో 11.45, లండన్ 4.45, కైరో 6.45 చూపించింది. లోయర్ డెక్‌లో లాంజ్, డైనింగ్ హాల్, అప్పర్ డెక్‌లో కేబిన్స్ ఉన్నాయి. 2013లో ఈజిప్ట్‌లో తిరుగుబాటు అల్లర్ల వల్ల పర్యాటకులు లేక ఆ వ్యాపారం దెబ్బతింది. దాంతో వారికి వ్యాపారం లేదు. మా ఓడ ఆ రాత్రికి అక్కడే ఉంటుంది.

మా కేబిన్ నంబర్ 324. రాత్రి లోయర్ డెక్‌లో బఫే డిన్నర్. వైట్ రైస్, పప్పు, ఆనియన్ సూప్, ఆనియన్ టార్ట్, వంకాయ చక్రాలమీద ఛీజ్, చిన్న జామపళ్ళు, కేక్స్, దానిమ్మ గింజలు, ఖర్బూజా, తురిమిన కేరట్. తెల్లవరుఝామునే లేవడంతో తొందరగా పడుకున్నాం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*